సాక్షి నిజామాబాద్

మంగళవారం ׀ 6 ׀ ఫిబ్రవరి ׀ 2024



మూడేళ్ల బాలుడి కిడ్నాప్

నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద మూడేళ్ల బాలుడు కిడ్నాప్ అయ్యాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో ▸



ప్రజావాణికి 97 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 97 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /21.1

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలిగా ఉంటుంది.


సైలెంట్‌గా సర్వేలు..

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల కసరత్తు
- సెగ్మెంట్ల వారీగా ప్రభావితం చేసే అంశాలపై వివరాల సేకరణ
- ముక్కోణపు పోటీ నేపథ్యంలో సర్వేలు
- సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌నే బరిలోకి దింపనున్న బీజేపీ
- కాంగ్రెస్ నుంచి పోటీకి ఆసక్తి చూపిస్తున్న పలువురు
- బీఆర్‌ఎస్ నుంచి కవిత బరిలో లేకపోతే బాజిరెడ్డి, బిగాలలో ఒకరికి చాన్స్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: శాసనసభ ఎన్నికలు పూర్తయిన నెల రోజులకే జిల్లాలో మళ్లీ ప్రధాన పార్టీలు వివిధ సంస్థలతో విడతల వారీగా సర్వేలు చేయిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పార్టీలు తమ అభ్యర్థులను బరిలో దింపేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో త్రిముఖ పోటీ ఉంటుందని పార్టీలు భావిస్తున్నాయి. దీంతో విలక్షణ తీర్పులకు పేరొందిన నిజామాబాద్ ప్రాంతంలో ఓటర్ల మనోగతం తెలుసుకునేందుకు పార్టీ సర్వే బాట పట్టాయి. నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆయా శాసనసభ సెగ్మెంట్ల వారీగా కులసమీకరణలు, ఇతరాత్ర ప్రభావితం చేయనున్న వర్గాలు, వివిధ అంశాల వారీగా అభిప్రాయాలు సేకరించేందుకు వరుసగా సర్వేలు చేయిస్తున్నాయి.

బీఆర్‌ఎస్ తరఫున ఎవరు..!

రెండు నెలల క్రితం రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ తరఫున నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి కల్వకుంట్ల కవిత పోటీ చేయని పక్షంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పోటీ చేస్తారనే చర్చ నడుస్తోంది. లేనిపక్షంలో బీసీ కోటాలో మాస్ లీడర్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డిని బీఆర్‌ఎస్ నాయకత్వం బరిలోకి దింపనున్నట్లు తెలుస్తోంది. అయితే బీఆర్‌ఎస్ టికెట్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీఎన్ రావు సైతం ఆశిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ టికెట్ విషయమై పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా బిగాల గణేశ్‌గుప్తా సోదరుడైన ఎన్‌ఆర్‌ఐ మహేశ్ గుప్తా సికింద్రాబాద్ లోక్‌సభ టికెట్ రేసులో ఉన్నారు.



దీటైన అభ్యర్థిని బరిలో నింపేందుకు కాంగ్రెస్ అడుగులు

రాష్ట్రంలో అధికార పార్టీగా, కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ సైతం నిజామాబాద్ స్థానంలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో దీటైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు గట్టిగానే కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో వివిధ దశల్లో వరుసగా సర్వేలు చేయిస్తోంది. అయితే కాంగ్రెస్ తరఫున పోటీ విషయమై ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, విప్ ఈరవత్రి అనిల్, సినీ నిర్మాత దిల్‌రాజు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సర్వేల్లో జీవన్‌రెడ్డితో పాటు సునీల్‌రెడ్డిపై సానుకూలత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జీవన్‌రెడ్డి కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగనున్నట్లు సమాచారం. దీంతో పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సైతం ముత్యాల సునీల్‌రెడ్డిపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక సునీల్‌రెడ్డి తాజా శాసనసభ ఎన్నికల్లో అతి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. దీంతో నాయకులు సానుభూతి చూపిస్తుండడంతో పాటు యువ నాయకుడిగా దీటైన అభ్యర్థి అవుతాడని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా బీసీ కోటాలో ఈరవత్రి అనిల్ సైతం టికెట్ రేసులో ఉన్నారు.

బీజేపీ నుంచి సిట్టింగ్‌కే అవకాశం !

బీజేపీ తరఫున సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కే టికెట్ ఖాయంగా ఉన్నప్పటికీ ఆ పార్టీ సైతం విడతల వారీగా సర్వేలు చేయిస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి అభ్యర్థులుగా ఎవరు ఉంటారు. ప్రభావితం చేయనున్న అంశాలు, కుల సమీకరణాలు, గల్ఫ్ అంశాలు, పసుపు బోర్డు ప్రకటన తర్వాత పార్టీపై రైతుల్లో, ప్రజల్లో ఏ విధమైన స్పందన ఉందనే విషయాలతో పాటు ఇతర కోణాల్లో సర్వేలు చేయిస్తోంది. సిట్టింగ్ ఎంపీ మీద పార్టీలో కిందిస్థాయి కేడర్ ఆలోచనలు, ప్రధాని మోదీపై ఉన్న ఆదరణ, తటస్థుల్లో పార్టీపై ఉన్న అభిప్రాయం, జాతీయ స్థాయిలో ప్రభావితం చేయనున్న అంశాలపై సర్వేల్లో వివరాలు సేకరిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో సెగ్మెంట్ల వారీగా మూడు పార్టీలకు వచ్చిన ఓట్లు

సెగ్మెంట్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
నిజామాబాద్‌అర్బన్	59,853	44,828	75,240
నిజామాబాద్‌రూరల్	78,378	56,415	49,723
ఆర్మూర్	42,989	39,395	72,658
బాల్కొండ	65,884	70,417	30,250
బోధన్	66,963	63,901	33,555
కోరుట్ల	39,647	72,115	61,810
జగిత్యాల	54,421	70,243	42,138
మొత్తం	4,08,135	4,17,314	3,65,374

న్యూస్‌రీల్

అయోధ్య శ్రీ దర్శన్ యాత్ర ప్రత్యేక రైళ్లు ప్రారంభం



సుభాష్‌నగర్‌: అయోధ్య శ్రీ దర్శన్ యాత్ర ప్రత్యేక రైళ్లు ప్రారంభమయ్యాయి. బాల రాముని దర్శనం కోసం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం ప్రత్యేక రైళ్లను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ హిందూ సమాజం మొత్తం బాల రాముని దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రైళ్లను ప్రారంభించిందని తెలిపారు. నిజామాబాద్ నుంచి ఈనెల 13న ప్రత్యేక రైలు ఉందని, ఇందూరు భక్తులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ పర్యవేక్షణ



సుభాష్‌నగర్‌: జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన(ఎఫ్‌ఎల్‌సీ)కు ఈసీఐఎల్‌కు చెందిన 17 మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుంది. దాదాపు పది రోజుల పాటు బృందం ఇక్కడే ఉండి ఈవీఎంల పనితీరు క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఈనేపథ్యంలో కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను తెరిపించారు. స్థానికంగా గల 2,916 బ్యాలెట్ యూనిట్లు, 1,752 కంట్రోల్ యూనిట్లు, 2,373 వీవీప్యాట్‌లను నిపుణుల బృందం పరిశీలిస్తుందని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిణి కృష్ణవేణి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ ఉన్నారు.

క్వార్టర్స్‌కు చేరిన నిఖత్



నిజామాబాద్‌నాగారం: అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. బల్గేరియాలో కొనసాగుతున్న ఈ టోర్నీలో నిఖత్ మంగోలియా దేశానికి చెందిన క్రీడాకారిణిని 3–2 తేడాతో సోమవారం ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. ఈ నెల 8న ఫ్రాన్స్ క్రీడాకారిణితో తలపడనుంది.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- లంచం తీసుకుంటూ పట్టుబడిన తొర్లికొండ జీపీ సెక్రెటరీ



ఏసీబీకి పట్టుబడిన మనోహర్

జక్రాన్‌పల్లి: రూ. నాలుగు వేలు లంచం తీసుకుంటూ తొర్లికొండ పంచాయతీ కార్యదర్శి సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌కు చెందిన నిఖిల్ అనే యువకుడు ఇటీవల తొర్లికొండలో ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కోసం ఎన్‌వోసీ నిమిత్తం పంచాయతీ కార్యదర్శి తోపారం మనోహర్‌ను సంప్రదించాడు. కానీ అతడు రూ. 15 వేలు లంచం ఇస్తేనే ధ్రువీకరణ పత్రం ఇస్తానని చెప్పడంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు.. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి రూ. 4వేలు తీసుకెళ్లారు. ఈ డబ్బులను తీసుకుంటుండగా మనోహర్‌ను ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్, సీఐ నగేశ్‌లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యదర్శి వద్ద నుంచి రూ. 4వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పట్టుబడ్డ జీపీ కార్యదర్శి మనోహర్‌ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని అధికారులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

తూకం వేయకుండానే బియ్యం సరఫరా

- ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని నిలదీసిన డీలర్లు

వర్ని: తూకం వేయకుండానే రేషన్ బియ్యం సరఫరా చేసిన ఘటన వర్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద చోటు చేసుకుంది. దీంతో డీలర్లు ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శివకుమార్‌ను నిలదీశారు. వేర్ హౌస్ నుంచి పాయింట్‌కు వచ్చిన బియ్యాన్ని తూకం వేయకుండా నేరుగా లారీల్లో డంపు చేసి దుకాణాలకు సరఫరా చేయటంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసి ఇవ్వాలని ఇన్‌చార్జిని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని, సివిల్ సప్లై అధికారులతో దాడులు చేయించి కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి శివకుమార్‌ను సోమవారం వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన డీలర్లు నిలదీశారు. తూకం వేయక పోవడంతో 100 క్వింటాళ్లకు సుమారు నాలుగు క్వింటాళ్ల బియ్యం తక్కువ వస్తుందన్నారు. కేంద్రం ఇన్‌చార్జి మిగతా బియ్యాన్ని బయట విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని నిలదీస్తున్న డీలర్లు

అధికారులకు ఫిర్యాదు చేశాం



ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జికి ఎన్నిసార్లు తూకం వేసి దుకాణాలకు రేషన్ బియ్యం పంపాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. దీనిపై జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. ఇన్‌చార్జి నిబంధనలు పాటించకుండా డీలర్ల పొట్ట కొట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

– నగేష్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం

జిల్లాలోని ప్రతి డీలరు ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు వచ్చి బియ్యాన్ని తూకం వేసుకొని తీసుకువెళ్లాలి. ఈ నిబంధన కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. డీలర్లు పాయింట్‌కు రాకుండా నేరుగా బియ్యం పంపించాలనడంతోనే ఈ సమస్య వస్తోంది. ఇన్‌చార్జితో పాటు డీలర్లు కూడా తప్పకుండా నిబంధనలు పాటించాలి.

– జగదీశ్, సివిల్ సప్లయ్స్ డీఎం

అయోమయం.. గందరగోళం

- ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పండిత్ వినీత బాధ్యతల స్వీకరణ
- తాను స్వతంత్ర చైర్ పర్సన్‌ను అంటూ ప్రకటన
- ఉత్తర్వుల్లో అవిశ్వాసం వీగిపోయినట్లు లేదన్న విపక్ష కౌన్సిలర్లు

ఆర్మూర్‌: ఆర్మూర్ మున్సిపాలిటీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెబుతూ పండిత్ వినీత మున్సిపల్ కార్యాలయంలో సోమవారం తిరిగి మున్సిపల్ చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. తనకు అండగా నిలిచిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ బీ ఫారంతో పార్టీ గుర్తుతో కౌన్సిలర్‌గా గెలిచిన ఆమె.. ప్రస్తుతం తనకు ఏ పార్టీకి సంబంధం లేని స్వతంత్ర కౌన్సిలర్‌ను, చైర్ పర్సన్‌నంటూ ప్రకటించారు. మరోవైపు పండిత్ వినీతను గద్దె దింపడం కోసం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అవిశ్వాస తీర్మానంపై కలెక్టర్, ఆర్డీవోలను వివరణ కోరుతూ మాత్రమే మెమో మాత్రమే జారీ చేసిందంటూ ఎదురుదాడికి దిగారు.

మరోవైపు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సెలవులో ఉండగా జిల్లాస్థాయి అధికారులెవరూ క్లారిటీ ఇస్తూ ప్రకటన చేయకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇకపై ఇండిపెండెంట్‌ను..



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పండిత్ వినీత

ఇకపై తనకు బీఆర్‌ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదని.. తాను స్వతంత్ర కౌన్సిలర్, చైర్ పర్సన్‌గా కొనసాగుతానని ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. త్వరలో తమ మద్దతుదారులైన కౌన్సిలర్లతో చర్చించి ఏ పార్టీలో చేరతామో ప్రకటిస్తామన్నారు. తనకు మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లు రాజ్ కుమార్, భాగ్య, మురళీధర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చైర్ పర్సన్ పీఠంపై కన్నేసిన కొందరు కౌన్సిలర్లు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రోత్సాహంతోనే తనపై అవిశ్వాస తీర్మానం పెట్టారని ఆరోపించారు. సమావేశంలో కౌన్సిలర్లు సుంకరి సుజాత, తలారి మీన పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్నారు..



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ షేక్ మున్ను

ప్రజాస్వామ్యబద్ధంగా అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అండతో పండిత్ వినీత వర్గీయులు తప్పుడు ఉత్తర్వులతో ప్రజలను మభ్య పెడుతున్నారని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు బండారి ప్రసాద్, ఇట్టెడి నర్సారెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవిశ్వాస తీర్మానం సమావేశంపై వివరణ కోరుతూ కలెక్టర్, ఆర్డీవోకు మెమో మాత్రమే వచ్చిందన్నారు. ఇందులో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఎక్కడా లేదన్నారు. న్యాయ పోరాటం చేసి వారిని గద్దె దింపుతామని పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు ఇంతియాజ్, ఆకుల రాము, బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి రంగన్న, రెహమాన్ పాల్గొన్నారు.

సమస్యల వలయం.. ఉర్దూ మీడియం..!

- పాఠశాలల్లో అనేక సమస్యలు
- ఉపాధ్యాయుల కొరతతో అందని విద్యాబోధన



నగరంలోని కోజా కాలనీలో గల ఉర్దూ మీడియం పాఠశాల

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని అనేక ఉర్దూ మీడియం పాఠశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా టీచర్లు లేరు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 178 పాఠశాలలు

జిల్లాలో 178 ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 10 ఉన్నత పాఠశాలలు ఉండగా.. 486 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో 649 టీచర్ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం 481 మంది విధులు నిర్వహిస్తున్నారు. 168 ఖాళీలున్నాయి. టీచర్ల కొరత కారణంగా విద్యాబోధన సక్రమంగా అందడంలేదు. కనీసం విద్యావాలంటీర్లను నియమించి పాఠాలు చెప్పించడంలేదు. నగరంలోని పలు పాఠశాలలతో పాటు, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, బాల్కొండ, నవీపేట ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది.

సమస్యల్లో చదువులు..

ఉర్దూ మీడియం విద్యార్థులకు విద్యాబోధన సరిగ్గా అందడంలేదు. టీచర్ల సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో వారిపై ఒత్తిడి పనిభారం పడుతోంది. ప్రణాళిక ప్రకారం బోధన సాగడంలేదు. పాఠశాలలో యేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా.. టీచర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు విద్యావాలంటీర్ల నియామకానికి కూడా అనుమతి లేకపోవడంతో బోధన అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల రూరల్ ప్రాంతాల నుంచి విద్యాశాఖాధికారి కొందరు టీచర్లను జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలకు డిప్యూటేషన్ వేశారు. కానీ వారు స్కూళ్లకు రావడానికి ఇష్టపడడం లేదు. పైరవీలతో ఉన్నచోటే ఉండిపోతున్నారు. ఇలా ఇప్పటి వరకు 38 మంది టీచర్లు డిప్యూటేషన్లను నిలిపివేయించున్నారు.

జిల్లాలోని వివిధ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య

స్కూల్	విద్యార్థులు	టీచర్లు
నిజాంకాలనీ	302	3
సతీశ్‌నగర్	280	7
నసీం కాలనీ	68	1
మహబూబ్ కాలనీ	40	1
ఆటోనగర్	380	6
వెంగల్‌రావ్ నగర్	401	4
నాగారం	210	5
దారుగల్లి	344	13
వాల్మీకినగర్	272	5
సమీర్‌హిల్స్	51	1
ముజాహిద్‌నగర్	76	1
ధర్మపురి హిల్స్	190	3
రాకాసిపేట	344	3

ప్రత్యేక దృష్టి సారించాం



ఉర్దూ మీడియం పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేశాం. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందుల రాకుండా చూశాం. కొన్ని చోట్ల ప్రత్యేక తరగతులు జరగడంలేదని తెలిసింది. వీరిపై చర్యలు తీసుకుంటాం. విద్యాబోధనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. – దుర్గాప్రసాద్, డీఈవో

భగవద్గీతను ప్రతి హిందువు చదవాలి



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న స్వామీజీలు

- డిచ్‌పల్లిలో ప్రారంభమైన సాధు సమ్మేళనం చతుర్ద మహాసభలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): ప్రతి హిందువు భగవద్గీతను చదివి శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన సారాన్ని అర్థం చేసుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని స్వామీజీలు సూచించారు. సోమవారం డిచ్‌పల్లిలోని ఎస్‌ఎల్‌జీ గార్డెన్స్‌లో శ్రీ వశిష్ఠ సంచార శతసత్సంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల సాధు సమ్మేళన మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్సంగం సంస్థాపక అధ్యక్షులు సచ్చిదానందగిరి స్వామి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం శ్రీ మద్భగవద్గీత వేదాంత జ్ఞానయజ్ఞంలో భాగంగా భగవద్గీత పారాయణం చేశారు. భజన బృందాలు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీవశిష్ఠ సంచార శత సత్సంగ ప్రధాన కార్యదర్శి చౌకి రాములు, ఉప కార్యదర్శి భరత్ భూషణ్, కట్టా అశోక్, పార్శి సంధ్యారాణి, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు ఆధార్ లింక్ చేసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ వినియోగదారులు మీటర్లకు ఆధార్, రేషన్‌కార్డు నంబర్లను అనుసంధానం చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులు సోమవారం తెలిపారు. నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పొందడానికి వినియోగదారులు బిల్లింగ్ చేసే వారికి ఆధార్ నంబర్, రేషన్ కార్డు నంబరును అందించాలని సూచించారు. ఈ నెలకు సంబంధించి ఇప్పటికే బిల్లింగ్ చేసి ఉంటే వారికి వారం తర్వాత లింకు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఎండీ ఫారూఖ్‌కు డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెయూ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధక విద్యార్థి మహమ్మద్‌ ఫారూఖ్‌ డాక్టరేట్‌ సాధించాడు. తెయూ బయోటెక్నాలజీ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ ప్రవీణ్‌కుమార్‌ పర్యవేక్షణలో 'ఇంప్రూవింగ్‌ సాల్ట్‌ టలర్స్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ ఇన్‌ విట్రో జనరేషన్‌ ప్రొటోకాల్స్‌ ఫర్‌ జెర్బెరా జమ్మి సోని' అనే అంశంపై ఫారూఖ్‌ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. కార్యక్రమంలో తెయూ బయోటెక్నాలజీ విభాగాధిపతి జవేరియా ఉజ్మ, బీవోఎస్‌ చైర్మన్‌ మామిడాల ప్రవీణ్‌, ప్రిన్సిపాల్‌, సైన్స్‌ డీన్‌ ఆరతి, అధ్యాపకులు కిరణ్మయి, మహేందర్‌ పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్‌

నవీపేట: గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరిని తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎక్సైజ్‌ ఎస్సై మల్లేశ్‌ సోమవారం తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్‌లో భైంసా నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా గాంధారికి బాదావత్‌ వసంతరావు, బాదావత్‌ ప్రవీణ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 1050 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇటీవల వీరు బయటకు రావడంతో మరోమారు బైండోవర్‌ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాఫిక్‌ ఈ–చలాన్లపై రాయితీ గడువు పెంపు

ఖలీల్‌వాడి: జిల్లాలోని ట్రాఫిక్‌ ఈ–చలాన్లపై రాయితీ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 15 వరకు పెంచినట్లు సీపీ కల్మేశ్వర్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌ చలాన్లు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కోరారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలపై 80 శాతం రాయితీ, ఆర్టీసీ వాహనాలకు 90 శాతం రాయితీ, లైట్‌ మోటారు వాహనాలకు, భారీ వాహనాలకు 60 శాతం వరకు రాయితీ కల్పించిన విషయం తెలిసిందే.

ట్రాన్స్‌ఫార్మర్‌ కాయిల్స్‌ చోరీ

ఎడపల్లి: మండలంలోని ఠానాకలాన్‌ శివారులో సోమవారం తెల్లవారుజామున దొంగలు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి తీగను చోరీ చేశారు. ఈ ఘటనపై రైతు జల్లి నాగభూషణం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

- సత్వరమే అర్జీలను పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్‌: ప్రజావాణిలో వివిధ సమస్యలపై 97 ఫిర్యాదులు అందాయి. వీటిని సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 97ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తోపాటు, నగర పాలక సంస్థ కమిషనర్‌ మకరందు, డీపీవో జయసుధకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలివచ్చిన జాన్కంపేట్‌ గ్రామస్తులు

వేల్పూర్‌ మండలంలోని జాన్కంపేట్‌, పచ్చల నడుకుడ గ్రామాల వాగు సరిహద్దుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జాన్కంపేట్‌ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. గతంలోనూ ఈవిషయమై సర్వే అండ్‌ ల్యాండ్‌ రికార్డ్స్‌ ఏడీకి విన్నవించినా పట్టించుకోలేదని, సమస్యను సత్వరమే పరిష్కరించాలంటూ ప్రజావాణి సమావేశపు హాల్లోనే గ్రామస్తులు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో అదనపు కలెక్టర్‌ వారిని సముదాయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు. గ్రామస్తులు రమేశ్‌, చందన్‌, కిశోర్‌ గౌడ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మారిన వాట్సాప్‌ మెసేజ్‌



వైరల్‌గా మారిన మెసేజ్‌

లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాఠశాలలో ఎలాంటి పూజలు చేయవద్దని పాఠశాల వాట్సాప్‌ గ్రూపులో పెట్టిన మెసేజ్‌ వివాదాస్పదంగా మారింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహానికి కొన్నేళ్లుగా ప్రతి శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పూజలు చేస్తున్నారు. గత నాలుగు నెలల క్రితం పదోన్నతిపై హెచ్‌ఎంగా షౌకత్‌అలీ పాఠశాలకు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన పాఠశాలకు చెందిన వాట్సాప్‌ గ్రూపులో పాఠశాలలో అన్ని మతాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కావునా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలలో ఎలాంటి పూజలు చేయవద్దని పెట్టిన మెసేజ్‌ మండలంలోని పలు గ్రూపుల్లోకి వెళ్లడంతో విషయం వైరల్‌గా మారింది. దీంతో ఏఎస్సై సిబ్బందితో కలిసి పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. హెచ్‌ఎం అందుబాటులో లేకపోవడంతో సిబ్బందితో మాట్లాడారు. ఈ విషయమై స్థానిక ఎస్సై చైతన్యకుమార్‌ రెడ్డిని వివరణ కోరగా పాఠశాల వాట్సాప్‌ గ్రూపులో మెసేజ్‌ వచ్చిన విషయం వాస్తవమేనన్నారు. హెచ్‌ఎం అందుబాటులో లేకపోవడంతో మంగళవారం విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని రాజారాంనగర్‌కు కాలనీకి చెందిన షేక్‌మోహర ఇంటి నుంచి సోమవారం సాయంత్రం ఆడుకుంటూ తప్పిపోయింది. దీంతో బాలిక కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లితండ్రులు డయల్‌ 100కు సమాచారం అందించారు. కాగా ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ ఆదేశాల మేరకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద షేక్‌ మోహర కనిపించడంతో పోలీసులు పీఎస్‌కు తరలించారు. అనంతరం బాలికను కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

7 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

సుభాష్‌నగర్‌: జిల్లాలోని 530 జీపీల్లో ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం తెలిపారు. 7న గ్రామాల్లో రోడ్లు శుభ్రం చేయుట, గుంతల పూడిక, ముళ్లపొదలు, పిచ్చిమొక్కల తొలగింపు పనులు, 8న మురికికాలువలు, పబ్లిక్‌ స్థలాలను శుభ్రపర్చుట, 9న దోమల వృద్ధి నివారణకు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10న పనికిరాని బావులు, బోరుబావులను గుర్తించి పూడ్చివేయుట, 11న ఉపయోగంలో లేని వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగంపై అవగాహన, 12న గ్రే వాటర్‌ను నిర్మూలించేందుకు ఇంటి ఎదుట కిచెన్‌గార్డు, మ్యాజిక్‌ సోక్‌ పిట్లు, సోక్‌ పిట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 13న వ్యక్తిగత మరుగుదొడ్ల గుంతల వద్ద రెట్రో ఫిట్టింగ్‌ రెండవ గుంతను నిర్మించుట, సెప్టిక్‌ ట్యాంకుల వద్ద సోక్‌పిట్స్‌ నిర్మించుట, 14న పైప్‌లైన్‌ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించుట, ప్లాస్టిక్‌ వాడకంపై పలు చోట్ల అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 15న జీపీల్లో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటుచేసి మద్యపానం, మత్తుపదార్థాలు, గుట్కాలను సేవించకుండా ఉండేందుకు అవగాహన, పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక కార్యక్రమాల్లో గ్రామ, మండల, డివిజన్‌, మండల ప్రత్యేకాధికారులు భాగస్వాములుకావాలని పేర్కొన్నారు.

వివాదాల్లో పోలీసు అధికారి..?

- బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆరోపణలు
- తనను మోసం చేసిన వ్యక్తిని కాపాడుతున్నారని ఓ మహిళ ఆవేదన

ఇందల్వాయి: డిచ్‌పల్లి సర్కిల్‌లోని ఓ పోలీసు అధికారి వివాదాలకు కేంద్రంగా మారుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సదరు అధికారిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలు, విమర్శలకు ఆ అధికారి ప్రవర్తనా బలాన్ని చేకూరుస్తున్నది. తనను నమ్మించి మోసం చేసిన వ్యక్తికి సదరు పోలీసు అధికారి రక్షణ కల్పిస్తున్నారని ఆరోపిస్తూ కామారెడ్డి జిల్లాకు చెందిన మహిళ ఆదివారం సదరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిరసన తెలిపింది.

మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లో తనతోపాటు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్న పోలీసు అధికారి స్నేహితుడు రమేశ్‌ తనను ప్రేమించి రహస్యంగా పెళ్లి చేసుకున్నాడని తెలిపింది. తాను గర్భం దాల్చడంతో తప్పించుకు తిరుగుతున్నాడని, ఈ విషయంలో రమేశ్‌కు పోలీసు అధికారి సహకరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది.

అవినీతి ఆరోపణలు సైతం..

సదరు పోలీసు అధికారి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవినీతి, మ్యాన్‌ హ్యాండ్లింగ్‌ చేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. ఓ వివాహిత ఆత్మహత్య కేసులో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా వారు విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ మధ్యే సెలవుపై వెళ్లిన ఆయన ఆదివారం డిపార్ట్‌మెంట్‌ సిమ్‌ను అప్పగించి మళ్లీ సెలవులపై వెళ్లడం అనుమానాలకు తావిస్తోంది.


గ్యాస్‌స్టౌ రిపేర్‌ పేరిట చోరీ..



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

భీమ్‌గల్‌: గ్యాస్‌స్టౌ, బీరువాలు రిపేర్‌ చేస్తామని వచ్చి ఓ నిందితుడు బంగారం చోరీ చేసిన ఘటన మండలంలోని సుదర్శన్‌నగర్‌ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో సోమవారం మధ్యాహ్నం పట్టణ కేంద్రంలోని బాపూజీనగర్‌ కాలనీకి చెందిన షేక్‌ సద్దాం గ్యాస్‌స్టౌ, బీరువాలు రిపేరు చేస్తానంటూ తిరిగాడు. బోదాసు ఎల్లవ్వ తన ఇంట్లో ఉన్న బీరువాను రిపేరు చేయమని సద్దాంను పిలిచింది. రిపేరు చేస్తున్నట్లు నటించి అందులో ఉన్న నాలుగు తులాల బంగారాన్ని దొంగిలించారు. దీంతో బాధితురాలు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. ఎల్లవ్వ కుమారుడు పోషన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని మండల కేంద్రంలో పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోతంగల్‌ విండోలో తొమ్మిది మంది డైరెక్టర్ల రాజీనామా



పోతంగల్‌ విండో కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్లు

రుద్రూర్‌: పోతంగల్‌ సొసైటీలోని తొమ్మిది మంది డైరెక్టర్లు తమ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 12 మందికి గాను తొమ్మిది మంది తమ రాజీనామా పత్రాలను సోమవారం సంఘం కార్యదర్శి భరత్‌కు అందజేశారు. అనంతరం విండో వైస్‌ చైర్మన్‌ గంధపు పవన్‌ కుమార్‌ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మహాజన సభలో పాలకవర్గం రద్దుచేయాలని సభ్యులు తీర్మానం చేసినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో స్వచ్ఛందంగా తొమ్మిది మంది డైరెక్టర్లు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఆదాయ వ్యయాలు, సంఘ లావాదేవీలపై డైరెక్టర్లకు సమాచారం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే తమ రాజీనామాను ఆమోదించాలని జిల్లా సహకార అధికారిని కోరారు.

21 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ 10వ తరగతి, ఇంటర్‌ పరీక్ష ఫీజులను విద్యార్థులు ఈనెల 12 నుంచి 21 లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ సోమవారం పేర్కొన్నారు. రూ. 25 అపరాధ రుసుముతో ఈ నెల 27వ తేదీ వరకు, రూ. 50 అపరాధ రుసుముతో ఈ నెల 28 నుంచి మార్చి 4 వరకు పరీక్ష ఫీజులను ఆన్‌లైన్‌, మీసేవ కేంద్రాల్లో చెల్లించాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 8008 403518 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మూడేళ్ల బాలుడి కిడ్నాప్‌



నిజామాబాద్‌రూరల్‌: నగరంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ వద్ద మూడేళ్ల బాలుడు కిడ్నాప్‌నకు గురైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్‌ ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పలుచోట్ల యాచకవృత్తి చేసుకునే వారు జిల్లా కేంద్రానికి వలస వచ్చి కంఠేశ్వర్‌ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. తల్లితండ్రులు నిద్రిస్తున్న సమయంలో వారి మూడేళ్ల బాలుడిని బైక్‌పై వచ్చిన ముగ్గురు కిడ్నాప్‌ చేశారు. వీరి బాలుడిని తీసుకెళ్తున్న దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైస్‌ మిల్లులో మోటార్ల చోరీ

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని మాగి శివారులో ఉన్న బాలాజీ రైస్‌ మిల్లులో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. రైస్‌ మిల్లులో ఉన్న ఐదు కరెంట్‌ మోటార్లను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించిన మిల్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ సుమారు రూ. 75వేలు ఉంటుందని అన్నారు. దొంగతనాల నివారణకు పోలీసులు దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్‌

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను రెండవ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ సయ్యద్‌ఖదీర్‌ విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ సోమవారం తెలిపారు. గాంధారి మండలం చద్మల్‌కు చెందిన సంఘం శివకుమార్‌, నందిపేట్‌ మండలం దత్తాపూర్‌కు చెందిన జంగం రాజేశ్‌కు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై మురళి సోమవారం తెలిపారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌, ఫిట్‌నెస్‌ లేని ఆటోలు, జీపులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పకుండా వాహన ధ్రువీకరణ పత్రాలను తమవద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

లభించని ఆచూకీ..

బాల్కొండ: ఎస్సారెస్పీలో చేపల వేటకు వెళ్లి ఆదివారం గల్లంతైన ముప్కాల్‌ మండల కేంద్రానికి చెందిన రమేశ్‌ ఆచూకీ సోమవారం కూడా లభించలేదు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదని ఎస్సై భాస్కరా చారి తెలిపారు. మంగళవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు

ఎల్లారెడ్డి: హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్‌ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన సదానందంపై వ్యవసాయ భూమి విషయంలో అతడి అన్న కొడుకు ప్రవీణ్‌ ఈనెల 3న గొడ్డలితో దాడి చేశాడు. దీంతో ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై మహేశ్‌, సిబ్బంది ఉన్నారు.

చెరువులో ఇద్దరు యువకుల గల్లంతు



గల్లంతైన గణేశ్‌, బాలేశ్‌

బాన్సువాడ: బీర్కూర్‌ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం వద్ద గల అంకూశ్‌ఖాన్‌ చెరువు(మినీ ట్యాంక్‌ బండ్‌)లో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన గణేశ్‌, బాలేశ్‌ స్నేహితులు. వీరు సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై చెరువుకట్టకు వెళ్లారు. వీరిలో గణేశ్‌ కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గమనించిన బాలేశ్‌ కాపడటానికి చెరువులోకి దిగగా ఈతరాక నీటమునిగి పోయాడు. స్థానికులు గమనించే లోపు వారు నీట మునిగారు. ఇంటినుంచి ఉదయం వెళ్లిన ఇద్దరు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు గాలించగా చెరువు కట్టపై ద్విచక్రవాహనం, చెప్పులు కనిపించాయి. స్థానికుల సమాచారంతో చెరువులో గాలింపు చర్యలు ప్రారంభించారు. రాత్రి 9గంటల వరకు గజ ఈతగాల్లతో గాలించినా ఆచూకీ లభించలేదు. గణేశ్‌ బీర్కూర్‌లో పదో తరగతి చదువుతుండగా, బాలేశ్‌బీర్కూర్‌లో మోటర్‌ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.

వైన్‌షాపు నిర్వాహకులపై కేసు

కామారెడ్డి క్రైం: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో మద్యం దుకాణం ముందు ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన నిర్వాహకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అజాంపూర కాలనీకి చెందిన ఆనంద్‌, ఆకాశ్‌ మద్యం కొనుగోలు చేయడానికి వచ్చి బయట మరో వాహనంపై చేయి పెట్టడంతో దొంగలుగా భావించి కర్రలతో చితకబాదారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు వైన్‌షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఆరుగురి ఆత్మహత్య

పిట్లం(జుక్కల్‌): జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాములు (33) ఏ పని చేయకుండా తిరిగేవాడు. ఈ భార్య అంజవ్వతో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు.

రెంజల్‌(బోధన్‌): మండలంలోని నీలా గ్రామానికి చెందిన బోనగిరి జ్యోతి(35) జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రెంజల్‌ ఎస్సై ఉదయ్‌కుమార్‌ తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మికి ముగ్గురు కుమార్తెలు. వీరికి వివాహాలు కాగా రెండో కుమార్తె మానసిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో విడాకులు అయ్యాయి. కుమార్తె దీనస్థితిని తట్టుకోలేని తల్లి ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక..

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో ఒంటరితనం భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. గ్రామానికి చెందిన మల్లారి రాజు(50) కొంతకాలంగా మానసిక ఆరోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం రాత్రి గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

మాక్లూర్‌: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై సుదీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన కొయ్యల మీనా(29) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా మీనా తన భర్తతో ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకుంది. వీరికి నిహారిక అనే పాప ఉంది. మీనా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు.

అనారోగ్యంతో ఒకరు..



అలీంమియా మృతదేహం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్లలో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. నిర్మల్‌ జిల్లాకు చెందిన అలిమియా సొన్నా(56) గ్రామంలో ఉన్న తన కూతురు ఇంట్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో అలిమియా భార్య మృతి చెందింది. నాటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురై అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమార్తె తస్లీమా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తిపోట్ల ఘటనలో యువకుడి మృతి



పవన్‌ (ఫైల్‌)

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన కత్తిపోట్ల ఘటనలో తీవ్రంగా గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన ముగ్గురు స్నేహితులైన పవన్‌, చిన్ను, చందుల మధ్య మద్యం విషయమై గొడవ జరిగింది. తొలుత పవన్‌పై చిన్ను, చందులు దాడి చేశారు. గాయపడ్డ పవన్‌ తన ఇంటికి వెళ్లాడు. ఘర్షణలో చిన్నుకు సైతం గాయం కావడంతో చిన్ను తల్లి రేణుక పవన్‌ ఇంటికి వచ్చి గొడవ పడింది. కోపంతో తనవెంట తెచ్చుకున్న కత్తితో పవన్‌ను పొడిచింది. తీవ్రంగా గాయపడ్డ పవన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులు రేణుక, చిన్ను, చందులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మృత్యువుతో పోరాడి..

పెద్దకొడప్‌గల్‌: మండలంలోని కాటేపల్లి తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పన్నాలాల్‌ మృతి చెందారు. ఉపధ్యాయుడు పన్నాలాల్‌ పిట్లం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడాది క్రితం పొలంలో రక్త పింజరి అనే పాము కాటు వేయడంతో నాటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉపాధ్యాయుడు పన్నాలాల్‌ మృతిపై తోటి ఉపాధ్యాయులు, తండా వాసులు సంతాపం తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

నవీపేట: మండలంలోని నాగేపూర్‌ శివారు బాసర రహదారి మూల మలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన సోహెల్‌ (24) మృతి చెందాడు. ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సోహెల్‌ తన సోదరుడు షౌకత్‌, మిత్రుడు కాంబేతో కలిసి బైక్‌పై నవీపేటకు వస్తుండగా అదుపు తప్పి సిగ్నల్‌ను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడ్డ సోహెల్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు షౌకత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మాధవ నగర్‌ బైపాస్‌ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బండారి విజయలక్ష్మి (64) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. వివరాలు.. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన బండారి భోజన్న, భార్య విజయలక్ష్మితో కలిసి స్కూటీపై బర్దిపూర్‌ కు వెళుతున్నాడు. మాధవనగర్‌ బైపాస్‌ వద్ద వెనకనుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భోజన్న, విజయలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విజయలక్ష్మి మృతిచెందింది. ఆమె కుమా రుడు సుధాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బురదలో పడి ఒకరు..

మాచారెడ్డి: మద్యం మత్తులో బురదలో పడి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ సోమవారం తెలిపారు. రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన టేకుమల్ల కిషన్‌(39) ఆదివారం దోమకొండ మండలం ముత్యంపేటలోని బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. మార్గమధ్యంలో మద్యం సేవించిన అతను భవానిపేట శివారులోని పొలంలో ప్రమాదవశాత్తు బోర్లా పడడంతో ఊపిరాడక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన కమ్మరి శేఖర్‌ (29) గత నెలలో మెదక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ శేఖర్‌ కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.